ప్రేమస్వరూపులారా!

ఇక్కడికి నేను రావడం కొంచెం ఆలస్యం కావటంచేత అందరికీ కొన్ని ఆపోహలు బయలుదేరినాయి. ఏ పనీ లేకుండా నేను ఊరికే ఉండను. నాకోసం కాచుకున్న భక్తులకోసం నేను అక్కడే ఉండి వారిని సంతృప్తిపరచి బయలుదేరి వచ్చాను. నేను చేసే ప్రతి ఒక్కటీ భక్తులయొక్క పనియే. 'నాది' అనే పని ఒక్కటీ లేదు. నేను తిండి తీర్థములకోసము రాలేదు. భోజనం చేయటం, నీరు త్రాగటంకూడను నా పని కాదు. కేవలము నాలుక తడుపుకొని మాట్లాడుతుంటాను. ఎంత కొత్త కారైనా పెట్రోలు లేకుండా నడవదు కదా!

ఈనాడు ప్రపంచము పరిపరి విధముల ప్రవర్తిస్తున్నది. నైతిక, భౌతిక, ధార్మిక, లౌకిక, ఆధ్యాత్మిక మొదలైన అన్ని రంగములందు మాలిన్యం బయలుదేరింది. చిత్రవిచిత్రముగా మారిపోయిన ఈ జగత్తును చూస్తే చాలా నవ్వు వస్తుంది, చాలా బాధకూడా కలుగుతుంది.

మానవత్వము చాలా పవిత్రమైనది. మానవత్వముకంటే మించిన శక్తి మరొకటి లేదు. మానవుడు రెండు విధములైన విద్యను అభ్యసించాలి. ఒకటి 'ఎడ్యుకేషన్', రెండవది 'ఎడ్యుకేర్'. 'ఎడ్యుకేర్' అనగా లోపలనుండి వెలికితీసే విద్య. హృదయమునుండి ఆవిర్భవింపజేసుకోవాలి. ఎవరో వ్రాసిన పుస్తకాలను చదివి నేర్చుకొనేది 'ఎడ్యుకేషన్'. కాని, ఎడ్యుకేర్ అలాంటిది కాదు. అది స్వశక్తి. సాధన చేసి నీలోనున్న దానిని వెలికితీయాలి. దేనిని వెలికితీయటము? లోపల దాచుకున్న కృత్రిమమైన విషయాలన్నీ బయటకు తీయడం కాదు. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలను వెలికితీయడం.

మొదటిది సత్యము. సత్యమనేది ఎవరు వ్రాసారు? ఎవరు చెప్పారు? ఎవరు చూపించారు? ఇది ఒకరు వ్రాసేది కాదు. "మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్." మనోవాక్కాయకర్మల ఏకత్వముతోకూడిన మహాత్ములే ఈ సత్యాన్ని బోధిస్తూ వచ్చారు. సత్యము అనేది మన హృదయమునుండి ఆవిర్భవించునటువంటిదే!

రెండవది ధర్మము. దీనిని ఎవరు సృష్టించారు? ఏది ధర్మము? ఏది అధర్మము? ఈవిధంగా విచారణ చేస్తే, ధర్మమనేది ఒకరు సృష్టించినది కాదు. "సత్యాన్నాస్తి పరో ధర్మః". ఈ సత్యమునుండియే ధర్మము పుట్టినది.

మూడవది శాంతి. ఏ కోటీశ్వరుడినైనా మీరు ప్రశ్నించండి, 'అయ్యా! మీకన్నీ ఉన్నాయి కదా! మీరు సంతోషంగా ఉన్నారా?' అని. "నాకు అన్నీ ఉన్నాయి కాని, శాంతి లేదు" అని జవాబిస్తాడు. శాంతి అనేది ఎవరిస్తారు? ఇది ఒకరిచ్చేది కాదు. హృదయమునుండే రావాలి. ఈనాడు ప్రపంచములో ఎక్కడ చూసినా 'పీసెస్' కనిపిస్తున్నాయికాని, 'పీస్' కనిపించటం లేదు.

నాల్గవది ప్రేమ. ఈ ప్రేమ ఎక్కడనుంచి వచ్చింది? అమ్మ యిచ్చిందా? అప్ప యిచ్చాడా? ఇంకెవరైనా ఫ్రెండ్స్ యిచ్చారా? ఎవరైనా గిఫ్ట్ యిచ్చారా? లేదు. ప్రేమ నీనుండియే పుట్టినది. ప్రేమయే నీ ప్రాణం. ప్రేమ లేకుండిన మనకు ప్రపంచమే కనిపించదు.

ఐదవది అహింస. "అహింసా ప్రథమో ధర్మః" అని ప్రబోధించాడు, బుద్ధుడు. కాని, ఈనాడు ప్రపంచమందు ఎక్కడ చూసినా హింసయే, హింసయే. అహింస అనేది హృదయమునందే ప్రారంభమౌతుంది.

సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనేవి ఒకదాన్ని ఒకటి అనుసరించి వచ్చేవేగాని ప్రత్యేకమైనవి కాదు. ఈ ఐదు గుణములూ ప్రపంచములో పరమాత్ముని వరప్రసాదములే! వాటిని మనము ఆవిర్భవింపజేసుకొని అనుసరించటానికి తగిన ప్రయత్నము చేయాలి. అదియే 'ఎడ్యుకేర్'.

మానవునికి ఉండవలసిన ప్రధానమైన లక్షణము ఏమిటి? సత్యమును పలకాలి. ఇష్టము వచ్చినట్లు అసత్యం పలకటం, నోటికి వచ్చినట్లు మాట్లాడటం మానవత్వం కాదు. నాలుకకు ఎముక లేదు కదా అని ఎట్లా

కావాలంటే అట్లా త్రిప్పితే అది సత్యమెట్లవుతుంది! సత్యము నాలుకపైన నాట్యమాడాలి. ఏదైనా మాట్లాడే ముందు ఇది సత్యమా, కాదా అని విచారణ సల్పాలి. సత్యము ఒక్కటే. Truth is one, not two. రెండుగా ఉన్న అసత్యమేగాని, సత్యము కాజాలదు. హృదయమునుండి ఆవిర్భవించిన ఏ సత్యమైతే ఉన్నదో దానినే మనము పలకాలి. సత్యమే ప్రపంచముయొక్క స్వరూపము. దీనిలోపలే సర్వమూ సంచరించుచున్నది.

ఆకాశంలో సంచరించే మేఘములు అప్పుడప్పుడు సూర్యునికి అడ్డు వస్తాయి. వాటిని మనము తోసివేయటానికి వీలుకాదు. వాటితో జగడము వేయడానికి సాధ్యం కాదు. అవి ఏవిధముగా వచ్చినాయో ఆవిధముగానే పోవాలి. ఆ మేఘములు తొలగిపోయిన తక్షణమే సూర్యుడు మనకి గోచరిస్తాడు. అదేవిధముగా, మన హృదయాకాశములో దట్టముగా క్రమ్ముకున్న సంకల్ప వికల్పములనే మేఘములు తొలగిపోయినప్పుడే సత్యము సాక్షాత్కరిస్తుంది.

ఈ ప్రపంచములో పంచభూతములు సహజముగా పుట్టినవి. అవి ప్రకృతి సహజములు. అదేవిధంగా, సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలు మానవుని హృదయంలో సహజంగానే ఉన్నాయి. వాటిని ఆవిర్భవింప జేసుకొని మానవుడు సహజమైన జీవితాన్ని గడపాలి. అవి 'సోర్సు' నుండి రావాలేగాని, 'ఫోర్సు'వలన వచ్చేవి కావు. సత్యము, ప్రేమ మొదలైనవి మననుండి సహజంగా ఆవిర్భవించాలి. సత్యము నిర్మలమైనది. ప్రేమ నిస్వార్థమైనది. అందుచే నిస్వార్థముగా మనమ జీవించాలి. అదే నిజమైన ప్రేమ తత్త్వము. ఈ ప్రేమ ఒకదానిని ఆశించదు; ఒక దానిని త్రోసివేయదు. స్వార్థము మనిషిని అనేక విధములుగా కలత పెడుతుంది. ఇది చాలా మాయలమారి. దీనిని దగ్గరికి రానివ్వకూడదు. ప్రేమగలవానిని స్వార్థము 'టచ్' చేయలేదు. కాబట్టి, ప్రేమను మీరు అభివృద్ధిపరచుకోండి. అదియే మీకు దైవము. ప్రేమ వచ్చేటప్పటికి అహింస పిలువకనే వచ్చేస్తుంది. ప్రేమ ఉన్నచోట హింసయొక్క నీడకూడా కనిపించదు. ఈవిధంగా, మానవుడు సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలను సాధించినప్పుడే తనకు సరియైన మార్గము తోస్తుంది, సరైన బుద్ధి కుదురుతుంది.

కట్టడ యైనయట్టి నిజ కర్మము చుట్టుచు వచ్చి యే గతిం
బెట్టునో పెట్టినట్లనుభవింపక తీరదు కాళ్ళు మీదుగా
గిట్టక వ్రేలుడంచు దలక్రిందుగ గట్టిరె యెవ్వరైన నా
చెట్టున గబ్బిలంబులకు జేరిన కర్మము గాక మానవా!

గబ్బిలములు తల క్రిందకి, కాళ్లు పైకి పెట్టి చెట్టుకొమ్మలకు వ్రేలాడుతుంటాయి. అవి చీకటినే ఆశిస్తాయి. వాటి జీవితమంతా ఆవిధముగా జరుగుతుంది. గబ్బిలములంటే గిట్టక ఎవరైనా వాటిని ఆవిధంగా తలక్రిందులుగా కట్టారా? అది ఒకరు కట్టినది కాదు; భగవంతుని లీలయే. అదేవిధముగా, ప్రతి మానవుడు తన కర్మను అనుసరించక తప్పదు. ఆ కర్మ ననుభవించే సమయములోపల కొన్ని మార్పులు కలుగుతాయి. కొన్ని సమయములందు కర్మ అనేక చిత్రవిచిత్రములుగా కనిపిస్తుంది. ఒకసారి నారదుని ప్రశ్నించాడు విష్ణువు, 'నారదా! ఈ ప్రపంచము యేరీతిగా వున్నది?' 'స్వామీ!

చిత్రంబులు త్రైలోక్యప
విత్రంబులు భవలతాల విత్రంబులు స
న్మిత్రంబులు ముని జన వన
చైత్రంబులు విష్ణుదేవు చారిత్రంబుల్."

అన్నాడు. కర్మ మానవుణ్ణి అనేకరకములుగా ఆడిస్తున్నది. మరణం సంభవిస్తే దుఃఖిస్తారు. జననము జరిగితే

నవ్వుతారు. నవ్వులు, ఏడ్పులు కర్మఫలితములే కదా! భగవంతుడు చేసే చిత్రవిచిత్రములే కదా! ఏది జరిగినా దైవ సంకల్పమే అనే విశ్వాసము మనము అభివృద్ధి పరచుకోవాలి. ప్రపంచములో సుఖము లభిస్తే భగవంతునినుండి లభించినది అని అనుకుంటారు. కష్టములకు, దుఃఖములకు, విచారములకు నింద ప్రక్క వ్యక్తిపైన వేస్తుంటారు. సుఖము, సంతోషము, సుఖము, ఆనందము, దుఃఖము, కష్టము, నష్టము యివన్నీ భగవంతుని వరప్రసాదములే! ఇవన్నీ కదిలే మేఘములే!

విద్యార్థులారా! మొట్టమొదట మీ థాట్సును మీరు అరికట్టండి. ఈ థాట్సు అనే మేఘములే హృదయాకాశమందు సంచరిస్తున్నాయి. ఈ మేఘములు క్రమక్రమేణా కదిలిపోతూ, కదిలిపోతూ మనస్సనే చంద్రుని, బుద్ధి అనే సూర్యుని కప్పుతాయి. 'చంద్రమా మనసోజాతః'' చంద్రుడు మనస్సుయొక్క తత్త్వము. బుద్ధి సూర్యునియొక్క ప్రతిబింబము. ఈ ఇరువురూ హృదయమనే ఆకాశములో సంచరిస్తారు. కొన్నికొన్ని సమయములందు మన భావములు దట్టమైన మేఘములుగా ఏర్పడతాయి. అందులోను యౌవనంలో సంకల్పాలు (thoughts) చాలా దట్టం (thick) గా ఉంటాయి. డార్క్ క్లౌడ్స్ (దట్టమైన మేఘాలు) నీటితో కూడినవి. అనగా, ఆశలతో చేరినవి. అవి వచ్చినప్పుడే ఈ సూర్యచంద్రాదులు మరుగైపోతారు. అదే వేసవి సమయమందు ఇవన్నీ పోతాయి. అప్పుడు సూర్యుడు, చంద్రుడు మనకు చక్కగా కనిపిస్తారు. ఈ యౌవనంలోనే థాట్సు అధికంగా వస్తాయి. ఈ వయస్సులో మీకు చెప్పరానటువంటి బాధలంతా కలుగుతుంటాయి. దానిలో పూర్తిగా మునిగిపోయి క్రమక్రమేణా మీరు మానవత్వాన్నే మర్చిపోతారు. కాబట్టి, మొట్టమొదట ఆ 'క్లౌడ్సు'ను దూరము చేయాలి. క్లౌడ్స్ ఎక్కడనుంచి వస్తున్నాయి? అవి సంకల్పవికల్పముల ప్రభావమే. కాబట్టి, మొట్టమొదట మీరు థాట్సును కంట్రోల్ చేసుకోండి. అప్పుడే బుద్ధి, మనస్సు రెండూ ప్రకాశిస్తూ ఉంటాయి. మనస్సు ఒక bundle of clouds of thoughts. సంకల్పాలను అరికట్టుకున్నప్పుడు మనసు 'క్లియర్'గా ఉంటుంది. నరేంద్రుడు (వివేకానంద) మీ వయస్సులోనే ఈ 'క్లౌడ్స్'ను, ఈ 'థాట్సు'ను కంట్రోలు చేసుకోవటానికి చాలా ప్రయత్నం చేశాడు. ఆ 'క్లౌడ్స్'ను దూరము చేసుకున్నప్పుడే హృదయము పవిత్రమైపోయింది. "నేను భారతీయునిగా పుట్టినందుకు ఎంతో గర్విస్తున్నాను. భారతదేశము ఎంత పవిత్రమైనది! ఎంత నిర్మలమైనది!" అని తనలో తాను తల్చుకుంటూ వచ్చాడు. ఏ దేశానికి వెళ్లినా 'నేను భారతదేశంనుండి వచ్చాను', అంటూ భారతదేశ ఔన్నత్యాన్నిగురించి వారికి బోధించేవాడు. భారతదేశ పవిత్రతను గురించి తల్చుకుంటే ఎంతో గొప్పతనము వస్తుంది. కనుక, మనం మన దేశమునుగురించి తలుచుకుంటూ రావాలి. ఈనాటి పిల్లలు వివేకానంద, రామకృష్ణపరమహంస ఇలాంటి పెద్దల చరిత్రలను యేమాత్రమూ చదవటంలేదు. పిచ్చిపిచ్చి నవలలను చదువుతారు. దీనినే గొప్పగా భావిస్తారు. మీరు ఈ 'చీప్' పుస్తకాలను పక్కకు నెట్టాలి.

అందరియందు దైవమున్నాడు. God is everywhere. "ఏకాత్మ సర్వభూతాంతరాత్మ." అందరియందూ ఉన్నది ఒకే ఆత్మయే. అయితే, 'ఫలానివానితో నేను స్నేహం ఎందుకు చేయకూడదు?'' అని మీరనవచ్చును. వాని వయస్సు, వాని భావము, వాని ప్రవర్తన, వాని 'థాట్స్' సరియైనరీతిగా లేనప్పుడు నీవు అలాంటివానితో జతకడితే నీవు అట్టివాడవే అవుతావు. Tell me your company, I shall you what you are. కనుక, మనము మంచివారితో చేరాలి. దీనిని పురస్కరించుకొనియే శంకరులవారు, 'సత్సంగత్వే నిస్సంగత్వం, నిస్సంగత్వే నిర్మోహత్వం, నిర్మోహత్వే నిశ్చలతత్త్వం, నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః' అన్నాడు. నీవు మంచివారితో చేరు. మంచి మాటలు మాట్లాడు. మంచి దృష్టిని పెంచుకో. మంచి చూపులు, మంచి చర్యలు, మంచి భావములు ఉన్నప్పుడే నీవు మంచివాడవవుతావు. చెడ్డ పుస్తకాలను మీరు చదవకూడదు. చెడ్డ పుస్తకాలను చదవడం దుస్సంగంలో చేరడంవంటిది.

ముఖ్యంగా ఈనాడు మీకు దైవాన్నిగురించి, ఆధ్యాత్మిక విషయాన్ని గురించి చెప్పటానికి నేను పూనుకోలేదు. మీరు మీ నిత్యజీవితమును సత్యమైన జీవితముగా గడపటమే నాకు కావలసింది. సత్యము, ధర్మము, శాంతి, ప్రేమ, అహింస – ఈ పంచప్రాణములు మీ లోపల ఉన్నవి. కామ, క్రోధ, లోభ, మద, మాత్సర్యములు పైన ఉన్నటువంటివి. వాటిని బయటకు నెట్టి లోపలున్న మానవతా విలువలను బయటకు తీయాలి. బావిలో ఉన్న నీరును పైకి తేవాలంటే యేమి చేయాలి? ఒక పాత్రకు త్రాడు కట్టి నీటిలో వేసి ఆ త్రాడును పైకి లాగితే పాత్రతో పాటు నీరుకూడా వస్తుంది. కనుక, నీ హృదయమనే బావిలో మానవతా విలువలనే పవిత్రమైన జలమున్నది. వాటిని బయటికి తీయాలంటే నమ్మకమనే భద్రమైన త్రాడును సంపాదించాలి. కాని, 'నమ్మకమను రెండు నయనంబులే లేని అంధులైరి నేడు అవనియందు'. మనం అంధులం కాకూడదు. నమ్మకాన్ని బలపరచుకున్నప్పుడే మానవత్వము దివ్యత్వముగా మారిపోతుంది. అందరూ 'స్పీచ్'లు యివ్వగలరు. కేవలం ఈ మాటలను విన్నంతమాత్రమున మనకు తృప్తి కలుగదు. వింటాము, మర్చిపోతాము. అట్లుగాకుండా, విన్నవాటిని ఆచరణలో పెట్టాలి. ముఖ్యముగా మీరు నమ్మకమును భద్రంగా పెట్టుకోవాలి. నమ్మకమనే త్రాడు భద్రముగా ఉండినప్పుడే లోపల విడిచిన 'పాత్ర' సత్య, ధర్మ, శాంతి, ప్రేమలతో నిండి బయటికి రాగలదు. దీన్నే 'ఎడ్యుకేర్' అన్నారు. 'ఎడ్యుకేర్' అనగా లోపలి దాన్ని మనము పైకి లాగాలి. అంతేగాని, ఎడ్యుకేర్ అనేది ప్రత్యేకంగా బయట లేదు. అది కొంటే లభించేది కాదు. టీచర్సు చెబితే అభివృద్ధి అయ్యేది కాదు. నీకు నీవే దానిని అభివృద్ధిపరచుకోవాలి. అప్పుడే 'సెల్ఫ్ రియలైజేషన్' (ఆత్మసాక్షాత్కారం) కలుగుతుంది. 'సెల్ఫ్ రియలైజేషన్'కు మొట్టమొదట కావలసింది 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' (ఆత్మవిశ్వాసం). 'సెల్ఫ్ కాన్ఫిడెన్స్' రావాలంటే గుణములు పవిత్రంగా ఉండాలి.

ప్రేమస్వరూపులారా! మీరు చదివే చదువులు బుద్ధికుశలతకు తోడ్పడవచ్చు. కాని, మనకు నిజమైన ఆనందాన్నిచ్చేది 'ఎడ్యుకేర్'. అదే మన జీవితానికి ఆధారం. పుస్తక పాండిత్యం ప్రధానం కాదు. "ఎమ్మేలు, బియ్యేలు ప్యాసయి వచ్చియు పేరుగాంచిన పెద్దవారలైనను ఎడ్యుకేర్‌ను ప్రధానంగా తీసుకోవాలి. 'ఎడ్యుకేర్' లేక ఎన్ని చదివినా ప్రయోజనం ఉండదు. డిగ్రీలు తీసుకోవచ్చుగాని 'ఎడ్యుకేర్' లేక అది విద్యయే కాదు. మీరు చదివే చదువులు దేనికి పనికివస్తాయి? పొట్టకూటి నిమిత్తమై చదివే చదువులివి. గొప్పగొప్ప చదువులు చదివినవారున్నారు లోకములో. వారందరూ ఏమి చేస్తున్నారు? అహింసనేమైనా అభివృద్ధిపరుస్తున్నారా? ధర్మమునేమైనా కాపాడుతున్నారా? శాంతినేమైనా పోషిస్తున్నారా? కనీసం తామైనా శాంతిగా ఉన్నారా? లేదు. తమ బిడ్డలను కూడా తాము ప్రేమించలేకపోతున్నారు. మొట్టమొదట ప్రేమను సాధించండి. మీ ప్రేమను అందరికీ పంచండి. అప్పుడే ప్రేమతత్త్వముయొక్క రుచి మీకు అనుభవంలోకి వస్తుంది. విద్యార్థులయందు అన్ని శక్తులు ఉన్నవి. పంచభూతములు, పంచేంద్రియములు, పంచకోశములు చాలా భద్రముగా ఉన్నటువంటివి. వాటిని సద్వినియోగపరచుకొనకపోతే మీరు బలహీనులైపోతారు. ఆవిధంగా బలహీనులైనప్పుడు మీరు యేమీ సాధించ లేరు. ఆధ్యాత్మికమార్గంలో గట్టి పట్టుదల అవసరం.

పట్టినదేదియో పట్టనే పట్టితి
పట్టునెగ్గెడుదాక అట్టెయుండు
కోరినదేదియో కోరనే కోరితి
కోర్కె చెల్లెడుదాక కొలచియుండు
అడిగినదేదియో అడగనే అడిగితి
అడిగినదిడుదాక విడువకుండు

తలచినదేదియో తలచనే తలచితి
తలపు తీరెడుదాక తరలకుండు
పోరు పడలేక తానైన బ్రోవవలయు
ఒడలు తెలియక నీవైన ఉడుగవలయు
అంతియేగాని మధ్యలో ఆపివేసి
తిరిగి పోవుట భక్తుని దీక్షకాదు.

భగవంతుడు పెట్టే పరీక్షలో మంచి మార్కులు రావాలంచే దృఢమైన దీక్ష వహించాలి. చదువులోకూడా దీక్ష వహించాలి. అయితే, మంచి మార్కులు సాధించడంతో తృప్తిపడకూడదు. చెడు రిమార్కులు లేకుండా చూసుకోవాలి. అప్పుడే చదువుకు తగిన విలువ చేకూరుతుంది.

విద్యార్థులారా! నిత్యము మీకెన్నో విషయాలు బోధిస్తున్నాను. కాని, మీరు దానిని ఏమాత్రమూ యోచించటం లేదు. మీరు ఎందుకోసం ఇక్కడకు వచ్చారో మర్చిపోతున్నారు. దానిని నీవు మొట్టమొదట గుర్తించాలి. వచ్చినది ఒకదాని కోసము, చేసేది మరొక పని! దీనివల్ల ఏమాత్రమూ ఫలితముండదు. మీరు ఇడ్లీ, సాంబారు కావాలని ఆశిస్తున్నారు. కాని, మిలట్రీ హోటల్‌లోకి పోతున్నారు. మీరు మీ హృదయాన్ని పవిత్రము, పరిపక్వము గావించుకొనేందుకు వచ్చారు. కాని, హృదయాన్ని అపవిత్రము గావించే చర్యలలో ప్రవేశిస్తున్నారు. కారణం? మానసిక కాలుష్యమే! మీ మనస్సును, మీ 'థాట్సు'ను యేమాత్రమూ మాలిన్యపరచుకోకూడదు. మన పెద్దలు బోధించిన విషయాలన్నీ ఇలాంటివే! మీరు ఆధునిక విద్యార్థులు. మీరు ఆధునిక విద్యతోబాటు ప్రాచీన సాంప్రదాయమును నిల్పుకోవాలి. ఆవిధంగా నడచుకొన్నప్పుడే మీరు కోరిన ఆనందము లభ్యమౌతుంది. ఈ ఆనందమును మీరు సంపాయించుకున్నప్పుడే మీ జీవితం ధన్యమవుతుంది. "ఇహమున సుఖింప హేమతారక విద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య". మనము బ్రహ్మవిద్య నేర్చటానికి వచ్చాం. కేవలం లౌకికమైన విద్యలు నేర్చటానికి కాదు. లౌకికవిద్యతోబాటు ఆధ్యాత్మికవిద్యకూడా నేర్చుకోవాలి. ఈ రెండింటియందు మీరు సమానమైన స్థితిలో ప్రయాణము సల్పాలి. అప్పుడే మీరు తగిన సార్థకత పొందుతారు.

(1. గోవింద కృష్ణ జై.... 2. వహెగురు.....అనే భజనలతో భగవాన్ తమ దివ్యోపన్యాసాన్ని ముగించారు)

(2006 సెప్టెంబరు 29వ తేదీ దసరా సందర్భముగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబా వారి దివ్యోపన్యాసం)